'నిర్మలమ్మ'కరుణించేనా..?

- పసుపు బోర్డుకు నిధుల కేటాయింపుపై ఆశలు
- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రోత్సాహంపై ఎదురుచూపులు
- నేడు పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్



జగిత్యాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై జిల్లాకు నిధుల కేటాయింపుపై ప్రజల్లో ఆశలు నెలకొన్నాయి. నిజామాబాద్ జాతీయ పసుపుబోర్డుకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు విషయమై అందరిలో ఆసక్తి నెలకొంది. పసుపు బోర్డు ఏర్పాటు అయినప్పటికీ తదుపరి ప్రక్రియలో భాగంగా బడ్జెట్ కేటాయింపులపై రైతులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. మల్లాపూర్ మండలం ముత్యంపేట నిజాం దక్కన్ షుగర్ లిమిటెడ్ కర్మాగారాన్ని ప్రారంభించాలనే డిమాండ్ ఉంది. వీటితో పాటు జిల్లాలో ఇథనాల్ ఫ్యాక్టరీ, భారీ వస్తు తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● జగిత్యాల-మంచిర్యాల రైల్వే లైన్‌పై ఆశలు

జగిత్యాల నుంచి మంచిర్యాల వరకు కొత్తగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాంలోనే ఈ రైల్వే లైన్ ఏర్పాటు డిమాండ్ ముందుకు వచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. నిజామాబాద్-ఆర్మూర్- కరీంనగర్- కాగజ్‌నగర్ లైన్‌లో రైళ్ల పెంచాలన్న డిమాండ్ ఉంది. అదేవిదంగా జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, నిజామాబాద్ మీదుగా ముంబైకి రైళ్ల సంఖ్య పెంచాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

జగిత్యాల నుంచి నిజామాబాద్, మంచిర్యాల మీదుగా అయోధ్య, వారణాసికి వెళ్లేందుకు రైళ్ల నడిపించాలన్న డిమాండ్ ప్రజల నుంచి వినిపిస్తోంది. ముంబాయి-కరీంనగర్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రతీ రోజు నడపాలని ప్రయాణికులు కోరుతు న్నారు. జిల్లాలోని పలు మండలాల్లో పసుపు అధికంగా సాగవుతుండడంతో పసుపు రవాణాకు గూడ్స్ రైలు నడపాలని చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు, రైతులు కోరుతున్నారు. మామిడి సాగులో జిల్లా ముందంజలో ఉంది. ప్రతీ యేటా జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి ప్రాంతాల్లో గల మామిడి మార్కెట్‌లలో సుమారు రూ.వెయ్యి కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుంది. ఢిల్లీ, ముంబాయి, పుణే తదితర ప్రాంతాలకు చెందిన హోల్‌సెల్ వ్యాపారులు సీజన్‌లో జిల్లాకు వచ్చి మామిడిని కొనుగోలు చేసి పలు ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. అయితే ఇక్కడి నుంచి నేరుగా రైతులు ఇతర ప్రాంతాలకు ...

● నవోదయకు నిధుల విడుదలకు ఎదురుచూపులు

జిల్లాకు ఇటీవల నవోదయ విద్యాలయాన్ని, కేంద్రీయ విద్యాలయాలను మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే పాఠశాలల నిర్మాణాలకు అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం నుంచి సేకరించాల్సి ఉంది. అదేవిదంగా నవోదయ విద్యాలయం, కేంద్రీయ విద్యాలయాల నిర్మాణాలకు, మౌలిక వసతులకు అవసరమైన నిధులు కేంద్రం బడ్జెట్‌లో మంజూరు చేయాల్సి ఉంది. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతం నుంచి హైదరాబాద్, నాగ్ పూర్, ముంబై, ఢిల్లీ తదితర ప్రాంతాలతో లింకు కలిపి పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలని పలువురు వ్యాపారులు కోరుతున్నారు. జగిత్యాల వద్ద వస్తువుల తయారీ యూనిట్లను నెలకొల్పాలన్న డిమాండ్ ఉంది.

మిగతా 6లో

అంజన్న ఆలయ ఏఈవోకు సన్మానం

మల్యాల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో ఏఈవోగా విధులు నిర్వహిస్తున్న వైరాగ్యం అంజయ్య శుక్రవారం పదవీ విరమణ పొందడంతో అధికారులు, ఆలయ అర్చకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈవో కృష్ణప్రసాద్, పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహరనాథ్, 6ఏ ఆలయాల రాష్ట్ర జేఏసీ నాయకుడు ఉపాధ్యాయుల చంద్రశేఖర్, ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధానర్చకులు రామకృష్ణ, జితేంధర్, రఘు, ఉపప్రధానర్చకులు చిరంజీవి, మారుతితో పాటు ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

బీర్‌పూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ఆర్డీవో మధుసుదన్ అన్నారు. శుక్రవారం బీర్‌పూర్ మండలంలోని చిన్నకొల్వాయి గ్రామం పరిధిలో గోదావరి ప్రాంతంలో స్వాధీనం చేసుకున్న ఇసుక డంపులను పరిశీలించారు. మండలంలో ఇసుక అక్రమ రవాణా జరుగకుండా ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ముంతాజుద్దిన్, రెవెన్యూ పరిశీలకులు శ్రీనివాస్ ఉన్నారు.

మండల స్థాయి టాలెంట్ టెస్ట్

కొడిమ్యాల, జనవరి31(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో శుక్రవారం భౌతిక శాస్త్రంపై మండల స్థాయి పరీక్షను ఉపాధ్యాయులు నిర్వహించారు. మండలంలోని తిర్మలాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థి గంగుల అభినయ్ సాదించాడు. రెండవ ర్యాంక్ మండల కేంద్రానికి చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థి సుష్మశ్రీ, కోనాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన కె. రమ్యశ్రీకి వచ్చాయి. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటలు ఎండిపోకుండా నీటిని అందిస్తా-ఎమ్మెల్యే సత్యం


మైసమ్మ చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యం

కొడిమ్యాల, జనవరి31(ఆంధ్రజ్యోతి) : చొప్పదండి నియోజకవర్గంలో ఎకరం పొలం ఎండిపోకుండా నీటిని అందిస్తానని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. శుక్రవారం మండలంలోని మైసమ్మ చెరువుకు ఎల్లంపల్లి నీరు చేరటంతో చెరువును పరిశీలించారు. అనంతరం పూలను చల్లి పూజలు చేశారు. కొడిమ్యాల మైసమ్మ చెరువు నుంచి పోతారం చెరువుకు పంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చివరి మడి వరకు సాగు నీటి అందించి రైతులకు కష్టాలు లేకుండా చూస్తానన్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డితో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించి నీరందిస్తున్నామన్నారు. గతంలో రైతులు రోడ్లెక్కి ధర్నాలు చేస్తే తప్ప సాగు నీరు పొలాలకు రాలేదన్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, మల్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముత్యం శంకర్, ప్రభాకర్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, హన్మండ్లు, అజయ్, రాజు, జలెందర్, లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ మోసపూరిత హామీలను ఎండగట్టాలి

మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత


నినాదాలు చేస్తున్న మాజీ జడ్పీచైర్‌పర్సన్ వసంత

జగిత్యాలరూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరిత హామీలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ఉండాలని జగిత్యాల మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి, గుత్రాజ్‌పల్లి, అనంతారం, కల్లెడ గ్రామాల్లో శుక్రవారం గ్రామ సమన్వయకమిటీ సమావేశాలను నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ జడ్పీచైర్‌పర్సన్ మాట్లాడుతూ కార్యకర్తలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పాటుపడాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేయాలని అన్నారు. ప్రజలకు, కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు ఆనందరావు, నాయకులు గంగారెడ్డి, కమలాకర్‌రావు, మోరపల్లి, అనంతారం, గుత్రాజ్‌పల్లి, కల్లెడ బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు



మాట్లాడుతున్న మల్టీజోన్ - 1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి హాజరైన అధికారులు

●మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి

జగిత్యాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సమర్థవంతమైన పోలీసు వ్యవస్థలోనే శాంతి భద్రతలు పటిష్టంగా ఉంటాయన్నారు. శుక్రవారం పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని డీఎస్పీ, సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వ హించారు. ముందుగా జిల్లాకు వచ్చిన ఐజీ చంద్రశేఖర్ రెడ్డికి ఎస్పీ అశోక్‌కుమార్ పుష్ప గుచ్ఛం అందించి స్వాగతించారు. శాంతి భద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసుశాఖ తీసుకుంటున్న చర్యలు, పోలీసు అధికారుల పనితీరు, జిల్లాలో నమోదైన కేసుల వివరాలను ఐజీ చంద్రశేఖర్‌కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఐజీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఉమెన్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, నేర నియంత్రణ, కేసుల విచారణ తీరు, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన ప్రత్యేక చర్యల గురించి వివరించారు. క్షేత్ర స్థాయిలో పోలీసు అధికారులకు, సిబ్బందికి ఎదురవుతున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి సూచనలు ఇచ్చారు. నిజాయితీతో విధులు నిర్వహిస్తూ పోలీసుశాఖ కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చే పోలీసు అధికారులకు, సిబ్బందికి అండగా నిలుస్తానన్నారు. రోజువారీ పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. నేర పరిశోధనలో సాంకేతిక ఆధారాలను, సీసీ టీవీ కెమెరాలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీలు రఘు చందర్, రాములు, రంగారెడ్డి, డీసీఆర్‌బీ, ఎస్‌బీ, ఐటీకోర్, సీసీఎస్ ఇన్స్‌పెక్టర్లు శ్రీనివాస్, ఆరీఫ్ అలీ ఖాన్, రఫీక్‌ఖాన్, శ్రీనివాస్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు కిరణ్ కుమార్, వేణు, సీఐలు వేణుగోపాల్, రామ్ నరసింహారెడ్డి, నిరంజన్ రెడ్డి, సురేశ్, కృష్ణారెడ్డి, పలువురు ఎస్ఐలు, డీసీఆర్‌బీ, ఐటీకోర్ సిబ్బంది పాల్గొన్నారు.

వెల్గటూర్ ఎంపీడీవోగా వెంకటేశ్వర్ రావు

వెల్గటూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండల అభివృద్ధి అధికారిగా కెఎస్ వెంకటేశ్వర్ రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విధులు నిర్వహించిన ఆయన వెల్గటూర్‌కు బదిలీపై వచ్చారు. ఇంచార్జి ఎంపీడీవోగా విధులుల నిర్వహిస్తున్న ధర్మపురి మండల ఎంపీడీవో రవీందర్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన కెఎస్ వెంకటేశ్వర్ రావుకు ఇంచార్జి ఎంపీడీవో రవీందర్, సూపరింటెంట్ సూర్యారావు, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, సిబ్బంది ఆహ్వానం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యతోనే మహిళా సాధికారత సాధ్యం

మల్యాల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): విద్యతోనే మహిళా సాధికారత సాధ్యపడుతుందని ఐసీడీఎస్ సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. మండలంలోని ముత్యంపేటలో మహిళా సాధికరత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లింగ సమానత్వం, వివక్షత, పోక్సో చట్టం తదితర వాటి గురించి వివరించారు. సూపర్‌వైజర్ పవిత్ర, గౌతమి, స్వప్న, రజిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.


విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి


విద్యార్థినులకు అందిస్తున్న మెనూ పట్టికను పరిశీలిస్తున్న కలెక్టర్

● కలెక్టర్ సత్యప్రసాద్

బీర్‌పూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాన్యమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం బీర్‌పూర్ మండలకేంద్రంలోని పల్లె దవాఖానాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి ఫార్మసీ మందుల కాలపరిమితిని చూశారు. ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రతి రోజు ఓపీ సేవలు ఎంత మందికి అందిస్తున్నారని, సిబ్బంది ప్రతి ఒక్కరు సమయ పాలన పాటించాలని అన్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు శుభ్రమైన నీరు అందించాలని అన్నారు. అనంతరం మంగేళ గ్రామంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినిలకు అందిస్తున్న మెనూను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల తరగతి గదులు, పరిసర ప్రాంతాలను తిరిగి పరిశీలించారు. వంట రూమ్‌లోని సరుకులను, వంట గదిని పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. పాఠశాలలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణంలో మురికి కాలువ సమస్య ఉందని ప్రిన్సిపాల్ తెలుపడంతో వెంటనే సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. విద్యార్థుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో మదుసుదన్, జిల్లా విద్యాధికారి రాము, తహసీల్దార్ ముంతాజుద్దిన్, ఎంపీడీవో లచ్చాలు, ఆర్ఐ శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ మాలతి, హెల్త్ సూపర్‌వైజర్ కిషోర్ పవార్ ఉన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి 6
● జిల్లా విద్యాధికారి రాము
మధ్యాహ్న భోజనం వికటించి ఐదుగురు విద్యార్థినులకు అస్వస్థత 4


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి

బీడీ కార్మికులలకు కనీస వేతనం ఇవ్వాలి

● ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్



మాట్లాడుతున్న విలాస్

కోరుట్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : బీడీ కార్మికులకు కనీస వేతనం అందించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సి.ప్రభాకర్ భవనంలో బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలు రెండవ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా మహాసభలో పాల్గొన్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి అధ్యక్షతన రాష్ట్ర నూతన కమిటీని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫెడరేషన్ కమిటీకి రాష్ట్ర అధ్యక్షుడిగా గోవర్ధన్, ప్రధాన కార్యదర్శిగా సుతారి రాములు, గౌరవ అధ్యక్షుడిగా ఎండి మౌలానా, ఉపాధ్యక్షులుగా కొక్కుల శాంత, కేవి అనసూయ్య, గోదావరి, సహాయ కార్యదర్శిలుగా బత్తిని సదానందం, బాను చందర్, తీరనారి లక్ష్మణ్, కోశాధికారిగా ఎండి ముక్రం, కార్యవర్గ సభ్యులుగా కడారి రాములు, అజ్జ వేణు, తోట బిక్షపతి, ఓమయ్య, ఎండి ఖాసీంలు ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ బీడీ కార్మిక సంక్షేమ నిధి ద్వారా అందిస్తున్న పథకాలు యథావిధిగా కొనసాగించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి కార్మికులు ఐక్యమత్యం చాటిపోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలో మన సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చెన్న విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ బాధితులకు ప్రభుత్వం అండ

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్


దమ్మన్నపేట మహిళకు ప్రొసీడింగ్ అందిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన పులిశెట్టి రాజన్న కొంత కాలం క్రితం గల్ఫ్ దేశంలో మృతి చెందాడు.

ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కార్యాల యంలో ప్రభుతం నుంచి గల్ఫ్ పాలసీ ద్వారా మంజూ రు చేసిన రూ.5 లక్షలు ప్రొసీడింగ్ కాపీని మృతుడి భార్య లక్ష్మికి ఆయన చేతుల మీదుగా అందించారు. అనంతరం ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ వివిధ సందర్భాల్లో ప్రమాదాల బారిన పడి మృతి చెంది న గల్ఫ్ కార్మికుల కోసం ప్రభుత్వం ఈ పాలసీ ప్రవేశపెట్టినట్లు తెలిపారు. గల్ఫ్ దేశాల్లో ఎవరైనా మృతి చెందితే ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జక్కు రవీందర్, మాజీ కౌన్సిలర్ వేముల నాగలక్ష్మి, దమ్మన్నపేట మాజీ ఎంపీటీసీ పోడేటి గంగాధర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అప్పం తిరుపతి, ముత్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

కొడిమ్యాల, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : పూడూర్ గ్రామ శివారులో శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయ నిర్మాణానికి కొండగట్టు గిరిప్రదక్షణ సంకల్పకర్త శ్రీ సురేష్ ఆత్మారాం మహారాజ్, వాస్తు పండితుడు బ్రహ్మశ్రీ సీపెల్లి బ్రహ్మచార్యులు ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులుపాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం

వెల్గటూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెగ్యాం గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులను కులం పేరుతో అవమానిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

గాయపడిన వృద్ధురాలు మృతి



పద్మ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 19న వంట చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని తీవ్ర గాయాలపాలైన వృద్ధురాలు బొమ్మకంటి పద్మ(76) స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. గ్రామంలోని తనఇంటిలో పద్మ ఒంటరిగా నివసిస్తోంది. వంటచేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు చీర అంటుకుంది. మంటల్లో చిక్కుకున్న ఆమె కేకలు వేయడం వల్ల చుట్టుపక్కల వారు గమనించి కాపాడారు. అప్పటికే ఆమె తీవ్ర గాయాలపాలైంది. సమాచారం అందుకున్న కుమారులు, బంధువులు పద్మను స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

బైక్‌పై నుంచి పడి మహిళ..



భారతి (ఫైల్)

చొప్పదండి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణశివారులో బైక్‌పై నుంచి కిందపడి మహిళ మృతిచెందిన సంఘటన శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ అనూష కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన పసుపునుటి భారతి(60) నగునూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి బైక్‌పై వెళ్తోంది. బైక్‌ను కుమారుడు చంద్రశేఖర్ నడుపుతుండగా నవోదయ శివారులో మేకపిల్ల అడ్డువచ్చింది. చంద్రశేఖర్ తన బైక్‌ను అకస్మాత్తుగా నిలిపివేయగా వెనుకాల కూర్చున్న భారతి కిందపడింది. ఈప్రమాదంలో ఆమె తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స కోసం వెంటనే ఆమెను 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భారతి కుమారుడు పుసుపునూటి రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అనూష తెలిపారు.

స్వగ్రామం చేరిన మృతదేహం



మల్లేష్ (ఫైల్)

వేములవాడ టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం దుబాయి దేశం వెళ్లిన వ్యక్తి మృతదేహం శుక్రవారం స్వగ్రామం చేరింది. వేములవాడ పట్టణం తిప్పాపూర్ గ్రామానికి చెందిన గుడిసె మల్లేష్ (40) 18 నెలల క్రితం దుబాయి దేశం వెళ్లాడు. గత సంవత్సరం డిసెంబర్ 24వ తేదీన కూలిపని చేస్తుండగా ఇసుకదిబ్బ కూలి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. దీంతోమృతదేహం శుక్రవారం స్వగ్రామం చేరడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య ప్రమీల, కూతురులు కీర్తన, సాత్వికప్రియతో పాటు కుమారుడు ఉన్నాడు. మల్లేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

ఎలిగేడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన గోసిక అంజయ్య (29) అనే యువకుడు పురుగులమందు తాగి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. జూలపల్లి ఎస్సై సనత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అంజయ్య మద్యానికి బానిసై రోజూ ఇంట్లో గొడవచేసేవాడు. అదే క్రమంలో ఈనెల 29న పురుగుల మందు తాగాడు. గమనించిన బంధువులు కరీంనగర్‌కు అక్కడినుంచి హైదరాబాద్‌కు గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. మృతుడు అంజయ్య సోదరుడు గోసిక శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సనత్‌కుమార్ తెలిపారు.

పట్టించుకునే వారు లేక..

- తప్పని పరిస్థితుల్లో అధికారులను ఆశ్రయిస్తున్న వృద్ధులు
- వారసులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు
- హుజూరాబాద్ డివిజన్ పరిధిలో 46 ఫిర్యాదులు



హుజూరాబాద్ ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వృద్ధులు (ఫైల్)

హుజూరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జీవితం చరమాంకంలో ఉన్న వృద్ధులను వారి పిల్లలు పట్టించుకోకపోవడంతో వారు అధికారులను ఆశ్రయిస్తున్నారు. బాల్యంలో తమ బాగోగులను చూసి భవిష్యత్తును బంగారు మయం చేసి భరోసా కల్పించిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. మరికొందరు తల్లిదండ్రులను అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలకు పంపిస్తున్నారు. దయనీయ స్థితిలో ఉన్న తల్లిదండ్రులపై చేయి చేసుకొని సభ్య సమాజం తల దించుకునేలా వ్యవహరిస్తున్నారు. వీటన్నిటికి విరుగుడు చూపిస్తూ 2005లో అప్పటి ప్రభుత్వం రెవెన్యూ శాఖ ద్వారా సీనియర్ సిటిజన్ యాక్టు తీసుకువచ్చింది. వృద్ధ తల్లిదండ్రులపై కఠినంగా వ్యవహరించే వారసులకు హెచ్చరికలు జారీ చేసింది.

తల్లిదండ్రులపై పెరుగుతున్న దాడులు

నేటి సమాజంలో రోజు రోజుకు వృద్ధ తల్లిదండ్రులపై దాడులు పెరిగిపోతున్నాయి. కళ్ల ముందే కొన్ని సంఘటనలు జరుగుతుంటే మాకేందుకులే అని సమాజం పట్టించుకోవడం లేదు. వృద్ధ తల్లిదండ్రుల స్థిర, చిరాస్థులను తమ పేర్లపై మార్చుకుని వారిని పట్టించుకోవడం లేదు. పైగా దాడులు చేస్తున్నారు. 2005లో సీనియర్ సిటిజన్ యాక్టు వచ్చినా దాని గురించి పెద్దగా ప్రచారం లేదు. ఇటీవల సీనియర్ సిటిజన్ యాక్టుపై విస్తృత ప్రచారం జరుగుతుంది. వృద్ధ తల్లిదండ్రులను పోషించకపోయినా, వారిపైన దాడులు చేసినా చట్టం అటువంటి వారిని శిక్షిస్తుంది. సీనియర్ సిటిజన్ యాక్టు ప్రకారం వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఇళ్ల పట్టాలు చేసుకున్న తర్వాత వృద్ధ తల్లిదండ్రుల బాగోగులు పట్టించుకోకపోతే ఆ పట్టాను



హుజూరాబాద్ ఆర్డీవో కార్యాలయం

రద్దు చేసి తిరిగి తల్లిదండ్రులకే ఆ భూములు చెందేలా చేయవచ్చు ఉద్యోగాలు చేసే పిల్లలు తల్లిదండ్రులను పట్టించుకోకపోతే వారి వేతనం నుంచి 10వేల రూపాయలు ఇచ్చే వెసులుబాటు ఉంది. ఇవి తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ పరిధిలోకి వస్తాయి.

కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

డివిజన్‌లోని జమ్మికుంట, హుజూరాబాద్, ఇల్లందకుంట, వీణవంక, సైదాపూర్, శంకరపట్నం మండలాల్లోని సీనియర్ సిటిజన్ యాక్టు గురించి తెలుసుకున్న 46 మంది వృద్ధులు ఆర్డీవో రమేష్‌బాబుకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేయగానే అధికారులు వారి వారసులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. వినని వారిని స్థిరాస్తులు మార్పులు చేస్తామని హెచ్చరిస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు వచ్చిన 46 ఫిర్యాదుల్లో 33 పరిష్కారమయ్యాయి. 13 కేసులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని ఆర్డీవో రమేష్ బాబు తెలిపారు. ఉద్యోగులు కూడా తమ తల్లిదండ్రుల బాగోగులు చూసుకోవడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- 15 మంది ప్రయాణికులకు గాయాలు



గోరంటాల వద్ద అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

గంభీరావుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గోరంటాల గ్రామ సమీపంలోని బ్రిడ్జివద్ద ఏపీ 29జెడ్ 1742నంబర్ గల కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 15మందిప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరిని కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి, మరికొందరిని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి చికిత్సకోసం తరలించారు. కామారెడ్డినుంచి 52మంది ప్రయాణికులతో కరీంనగర్ వెళుతున్న ఆర్టీసీబస్సు గోరంటాల గ్రామ సమీపంలోని బ్రిడ్జివద్ద అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. పంటపొలాల్లో ఉన్న రైతులు, గ్రామయువకులు, నాయకులు ప్రమాదస్థలానికి చేరుకుని బస్సులోంచి ప్రయాణికులను కిందకుదించి, అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరళించారు. కామారెడ్డి ఆసుపత్రికిలో ఐదుగురు, సిరిసిల్లఆసుపత్రిలో 10మంది ప్రయాణికులు చికిత్సపొందుతున్నారు. ఎవరికీ ప్రాణాపాయం లేదనితేలడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈప్రమాదంలో కామారెడ్డి, తాడ్వాయి, రెడ్డిపేట, మాచారెడ్డి మండలాలకు చెందినవారు ఉన్నట్టుగా భావిస్తున్నారు. సంఘటనా స్థలానికి కామారెడ్డి డిపో మేనేజన్ ఇందిర, ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్‌ఐ శ్రీకాంత్ చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగితెలుసుకున్నారు. బ్రేకులు ఫెయిల్ అయ్యి ప్రమాదం జరిగిందా లేక వాహన వేగంలో స్టీరింగ్‌కు లాక్‌పడి ప్రమాదం జరిగిందా తెలియాల్సి ఉంది.

భార్యను హత్యచేసిన కేసులో జీవిత ఖైదు

కమాన్‌పూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌కు చెందిన కోల తిరుపతికి భార్యను చంపిన కేసులో గోదావరిఖనిజిల్లా ఆరో సెషన్స్‌కోర్టు న్యాయమూర్తి డాక్టర్ టి శ్రీనివాసరావు జీవతఖైదు విధించారు. కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జూలపల్లి గ్రామానికి చెందిన కోల స్వరూపను ఆమె భర్త కోల తిరుపతి 2020నవంబర్ ఆరవతేదీన గొంతునులిమి హత్య చేశాడు. ఈ మేరకు మృతురాలు స్వరూప తమ్ముడు కన్నం రాజేందర్ ఫిర్యాదు మేరకు అప్పటి కమాన్‌పూర్ ఎస్సై పి శ్యామ్‌పటేల్ కేసు నమోదుచేశారు. అప్పటి గోదావరిఖని 2వపట్టణ సీఐ కె లక్ష్మీనారాయణ దర్యాప్తు చేసి నివేదికను కోర్టులో సమర్పించారు. పబ్లిక్‌ప్రాసిక్యూటర్ టి జ్యోతిరెడ్డి సాక్షులను ప్రవేశపెట్టగా విచారణ అనంతరం గోదావరిఖని సెషన్‌కోర్టు న్యాయమూర్తి టి శ్రీనివాసరావు నిందుతునికి జీవితఖైదుతో పాటు, 1000రూపాయలు జరిమానా విధించారు.

రైలునుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఓదెల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓదెల రైల్వేస్టేషన్‌లో గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలునుంచి ప్రమాదవశాత్తు రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. గోరఖ్‌పూర్ నుంచి తిరువనంతపురం కొచ్చి వైపువెళ్లే రైలు బోగీలో ఉన్నవ్యక్తి రైలునడుస్తున్న సమయంలో మరోబోగీ ఎక్కే ప్రయత్నంలో రైలు ప్లాట్‌ఫాం మధ్య పడి మృతిచెందాడు. మృతుడు బ్లూ కలర్ చొక్కా, నల్లటి ప్యాంట్ ధరించి ఉన్నాడు . అతని వద్ద సెల్ ఫోన్ లభించినట్టు రైల్వే అధికారులు తెలిపారు.

వనం వీడి.. జనంలోకి నెమలి



గంభీరావుపేటలోకి వచ్చిన నెమలి

గంభీరావుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వనం వీడి ఓ వణ్యప్రాణి జనంలోకి వచ్చింది. అడవుల్లో పంట పొలాల్లో సంచరించే నెమలి ఊళ్లోకి వచ్చింది. గంభీరావుపేట గాంధీ చౌక్ నుంచి లింగన్నపేట వెళ్లే ప్రధాన రహదారిలో అనూహ్యంగా నెమలి ప్రత్యక్షమైంది. దీంతో వనంలో ఉండాల్సిన వణ్యప్రాణి జనంలోకి రావడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు. కొన్ని గంటల పాటు నెమలి ప్రధాన రహదారిలో తిరగడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

సీఐ అరాచకాలపై న్యాయపరమైన విచారణ జరిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న భాధితులు

జమ్మికుంట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణసీఐ వరంగంటి రవికుమార్‌పై జ్యుడీషియల్ ఎంక్వైరీ జరిపించాలని బాధితులు షేక్ సాబీర్‌అలీ, అంబాల రాజు, కాటిపల్లి లక్ష్మి, కాటిపల్లి సంధ్యారాణి, ఠాగూర్ సుశీల అన్నారు. శుక్రవారం జమ్మికుంటలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పోలీస్ అధికారులను కూడా సీఐ వేధిండన్నారు. జమ్మికుంటలో పనిచేయనివ్వకుండా ఇతరప్రాంతాలకు పంపిస్తున్నాడని ఆరోపించారు. పోలీస్‌స్టేషన్లో ఒక ప్రైవేట్ వ్యక్తి సీఐ గన్‌మెన్‌గా చలామణి అవుతున్నాడన్నారు. అతడికి తోడు హోంగార్డు యాకూబ్ కూడా ఉన్నాడన్నారు. వీరిద్దరూ ఇసుక ట్రాక్టర్ల వద్ద డబ్బులు వసూళ్లు చేస్తారని, డబ్బులు ఇవ్వని ట్రాక్టర్లను స్వాధీనం చేసుకోని స్టేషన్‌కు తీసుకువచ్చి కేసులు పెట్టిస్తున్నారని మండిపడ్డారు. కాటిపల్లి సంధ్యారాణి మాట్లాడుతూ అన్ని విషయాల్లో సీఐని ఏసీపీ శ్రీనివాస్ జీ కాపాడుతున్నారని, ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి వారిద్దరిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపడల ప్రజా పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడి డబ్బులు పోగొట్టుకున్న యువకుడు

- మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



బూస కార్తీక్ (ఫైల్)

శంకరపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ రమ్మీకి అలవాటు పడ్డాడు. లక్షలు సంపాదించవచ్చని భ్రమపడ్డాడు. ఉన్న డబ్బులు పోగొట్టుకుని చివరి ఆత్మహత్యాయ్నం చేసుకోగా శుక్రవారం రాత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. వివరాల్లోకి వెళితే.. శంకరపట్నం మండలం గద్దపాక గ్రామానికి చెందిన బూస కార్తీక్(25) ఆన్‌లైన్ రమ్మీ ఆటకు అలవాటుపడ్డాడు. దీంతో చేసిన అప్పులకు గతంలోనే తల్లిదండ్రులు అర ఎకరం భూమి అమ్మి ఆ అప్పు తీర్చారు. అయినప్పటికీ కార్తీక్‌లో మార్పు రాలేదు. మళ్లీరమ్మీ ఆటకోసం రూ.2లక్షల వరకు తల్లిదండ్రులకు తెలియకుండా అప్పులు చేసినట్లు సమాచారం. ఆ డబ్బులు కూడా ఆటలో పోగొట్టుకున్నాడు. తల్లిదండ్రులకు విషయం తెలపలేక అప్పు తీర్చే దారిలేక మనస్థాపంతో ఈనెల28న గద్దపాక శివారులోని వాగువద్ద క్రిమిసంహారక మందు తాగాడు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా స్నేహితుడు జక్కుల రాజ్‌కుమార్‌కు తెలిపాడు. రాజ్‌కుమార్ కార్తీక్ తండ్రికి శంకర్‌కు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని కార్తీక్‌ను జమ్మికుంటలోని ఓ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం హనుమకొండలోని ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల30న రాత్రి మృతిచెందాడు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట గ్రామశివారులోని మడేలేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న విద్యుత్ బోరు మోటారు తీగను అపహరించుకుపోయిన సంఘటనలో గంభీరావుపేట మండలం రాజేశ్వర్‌రావునగర్‌కు చెందిన శివరాత్రి శ్రీనివాస్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామ శివారులోని మడేలేశ్వరస్వామి ఆలయం సమీపంలోని విద్యుత్ బోరు మోటారుతీగను ఈనెల8న గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆలయ కమిటీ చైర్మన్ దీటి నర్సయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మండలకేంద్రంలోని రెండవబైపాస్ రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు శ్రీనివాస్ కరెంటు తీగతో పట్టుబడ్డాడు. అదుపులోకి తీసుకుని విచారించగా ఆలయం వద్ద ఉన్న బోరు మోటారు తీగను దొంగిలించానని అంగీకరించాడు. నిందితుడి వద్ద నుంచి రూ.8 వేల విలువైన విద్యుత్ తీగను స్వాధీనపర్చుకుని శ్రీనివాస్‌ను రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

రెస్టారెంట్‌లో కార్పొరేషన్ సిబ్బంది తనిఖీలు

కోల్‌సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్ సమీపంలోని ఓ రెస్టారెంట్‌లో శుక్రవారం తనిఖీలు నిర్వహించినట్టు మున్సిపల్ కార్పొరేషన్ వర్గాలు ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. కార్పొరేషన్ హెల్త్ అసిస్టెంట్ కిరణ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, శానిటేషన్ సిబ్బంది శ్రీకాంత్, శ్రావణ్, ప్రశాంత్ తనిఖీల్లో పాల్గొన్నారు. రెస్టారెంట్‌లో నాణ్యత ప్రమాణాలు పాటించనందున రూ.10వేల జరిమానా విధించినట్టు పేర్కొన్నారు.

గజసింగవరంలో దొంగల బీభత్సం..

- రెండిళ్లలో చోరీ
- రూ.60 వేల నగదు, 2 తులాల బంగారం అపహరణ



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

గంభీరావుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామంలో గురువారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళాలు వేసిన ఇళ్లలోకి దొంగలు చొరబడి నగదుతోపాటు, బంగారం, వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. బాల్‌నర్సు శ్రీకాంత్, బాయిని బాలయ్య ఇళ్ల తాళాలను పగులగొట్టి దొంగతానికి పాల్పడ్డారు. శ్రీకాంత్ తల్లి అనారోగ్యంతో సిద్దిపేటలోని ఓఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో శ్రీకాంత్ తన కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి తాళంవేసి ఆసుపత్రిలో ఉన్న తల్లి వద్దకు వెళ్లి, గురువారంరాత్రి అక్కడేఉన్నారు. దీంతో శ్రీకాంత్ ఇంటికివేసిన తాళాలను పగులగొట్టి లోనికి చొరబడి బీరువాలోఉన్న 60వేలనగదు, 2తులాల వెండి, నాలుగు పట్టగొలుసుల జతలు దొంగలు ఎత్తుకెళ్లారు. బాయిని బాలయ్య అదే గ్రామంలో కొత్త ఇల్లునిర్మించుకుని పాతఇంటికి తాళం వేశాడు. పాతఇల్లు తాళం పగులగొట్టి దొంగలు చొరబడ్డారు. అయితే ఆ ఇంట్లో ఏమి లేకపోవడంతో నష్టం జరగలేదు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్‌ఐ శ్రీకాంత్‌లు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ సిబ్బంది కూడా పరిసరాలను పరిశీలించి వెళ్లారు.

ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లో భారీ చోరీ

- తాళం పగులగొట్టి రూ.15లక్షలు ఎత్తుకెళ్లిన దుండగులు

కోల్‌సిటీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లోని ఇనగంటి రాంమోహన్‌రావు అనే సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో భారీ చోరీ జరిగింది. అతడిభార్య క్యాన్సర్ చికిత్స నిమిత్తం ఇంటికి తాళంవేసి ఈనెల26న రాంమోహన్‌రావు తన కుటుంబసభ్యులతో హైదరాబాద్‌కు వెళ్లాడు. శుక్రవారం తిరిగివచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. దొంగలు ఇంట్లోని కబోర్డ్‌లో ఉన్న రూ.15.2లక్షల నగదును ఎత్తుకె ళ్లారు. రెండురోజుల క్రితం చోరీజరిగినట్టు తెలుస్తోంది. భార్య చికిత్సనిమిత్తం ఇటీ వలే గోదావరిఖనిలోని తనప్లాట్ అమ్మగా వచ్చిన నగదును ఇంట్లో పెట్టానని, అత్యవసర చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లినట్టు ఆయన పేర్కొన్నారు.

బెడ్‌రూమ్ తాళం చెవి ఉండడంతో..

ప్రధానద్వారం తాళం పగులగొట్టి లోనికి చొరబడిన దొంగలు బెడ్‌రూమ్ తాళంతీసి లోనికి వెళ్లారు. బెడ్‌రూమ్ తాళంచేయి అందుబాటులో ఉండడంతో వారికి తాళం పగులగొట్టకుండానే లోనికివెళ్లడం సులు వైంది. ఇతర ఆభరణాలు కానీ, వస్తువులుకానీ ఎత్తుకెళ్లలేదు.భారీస్థాయిలో నగదు దొరకడంతో దానితో ఉడాయించారు. ఎన్టీపీసీ పోలీసులు, కమి షనరేట్ సీసీఎస్, క్లూస్ టీమ్‌లు ఘటనస్థలంలో పరిశీలించాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం

- కేసు నమోదు



స్రవంతి, శ్రీమోక్ష(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జనవరి31(ఆంధ్రజ్యోతి):ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామంలోని బిట్ల స్రవంతి, ఆమె ఐదేళ్లకూతురు శ్రీమోక్షలు అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ శుక్రవారం తెలిపారు. గ్రామంలోని బిట్ల మల్లేశంభార్య స్రవంతి తన కూతురు శ్రీమోక్షను తీసుకుని ఈనెల 28న చందుర్తిలోని తన తల్లిగారింటికి వెళుతున్నానని ఇంటిలో చెప్పి బయలుదేరారని పేర్కొన్నారు. భార్య, కూతురు చేరుకున్నారో..? లేదోనని అత్తగారింటికి ఫోను చేసిన మల్లేశంకు అక్కడకు రాలేదని తెలిసిందన్నారు. చుట్టుపక్కల, బంధువులవద్దఆరాతీసినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. బాధితుడు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ తెలిపారు.

న్యాయవాది పేరుతో ఘరానా మోసం

- రూ.1.30 కోట్లు వసూలు.. యువకుడి అరెస్ట్



ఫణిధర్

సిరిసిల్ల క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): న్యాయవాది పేరుతో ఓ వ్యక్తి ఘరానా మోసానికి పాల్పడ్డాడు. సమస్యలు పరిష్కరిస్తానని చెప్పి దాదాపు కోటి 30లక్షల రూపాయలు వసూలు చేశాడు. వచ్చినడబ్బుతో జల్సాలు చేశాడు. బాధితులు సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన ఏనుగు ఫణిధర్ అనే నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. సిరిసిల్ల టౌన్‌సీఐ కే కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన ఏనుగు ఫణిదర్ అనేవ్యక్తి తన సంపాదన సరిపోక శ్రమ లేకుండా పెద్దమొత్తంలో డబ్బులు సంపాదించాలనుకున్నాడు.

గతంలో స్థానికంగా ఓ న్యాయవాది వద్ద క్లర్క్‌గా పనిచేశాడు. ఆ అనుభవంతో భూ, సివిల్ తగాదాలు, లోన్ సమస్యలు, భార్యభర్తల గొడవలు... ఇలా కోర్టుకు సంబంధించిన సమస్యలపై ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని భావించాడు. న్యాయవాది అవతారమెత్తి కోర్టుల్లో కేసులు ఫైల్ చేయడానికి వచ్చే బాధితులతో పరిచయాలు చేసుకుంటూ, తనే న్యాయవాదినని నమ్మించాడు. గతంలో సిరిసిల్ల పట్టణంలోని బడ్స్ అండ్ ఫ్లవర్స్ ప్రైవేట్ స్కూల్ యజమాని కొంటికర్ల వారణాసి కాలిమాతకు సంబం ధించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరులో భూసమస్యను పరిష్కరిస్తానని నమ్మించి 25లక్షల రూపాయలు తీసుకొన్నాడు. సంజీవయ్య నగర్‌కు చెందిన దరిపల్లి సురేష్, అతడి సోదరుడు రమేష్‌లపై ఉన్న చెక్‌బౌన్సు కేసులతో పాటు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరిస్తా నని నమ్మించి, పలు దపాలుగా మొత్తం రూ.91,52,250 తీసుకున్నాడు. తాజాగా పెద్దూర్‌లోని డబుల్ బెడ్‌రూమ్‌లకు చెందిన విజయలక్ష్మిని నమ్మించి రూ.1.90 లక్షలు తీసుకొన్నాడు. అదేవిధంగా చంద్రంపేటకు చెందిన యెల్ల లలిత భూసమస్య పరిష్కరిస్తానని నమ్మించి ఆమె వద్ద రూ.11.60 లక్షలు వసూలు చేశాడు.

అయితే ఫణిధర్ చేతిలో మోసపోయామని తెలుసుకున్న బాధితులు సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేసి, సెల్‌ఫోన్‌తో పాటు పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు పంపినట్లు పట్టణ సీఐ కృష్ణ తెలిపారు. ఇంకా బాధితులు ఎవరైనా ఉంటే సిరిసిల్ల పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థినులకు అస్వస్థత



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ధర్మపురి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని మైనార్టీబాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం వికటించి శుక్రవారం ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం జుహా, శ్రావ్య, హుమేరియా, నందిని, కీర్తిమణి అనే ఐదుగురు విద్యార్థులకు కడుపు నొప్పి వచ్చి వాంతులు చేసుకున్నారు. వెంటనే కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కాళ్ల లక్ష్మి చికిత్సకోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. బియ్యం సరిగా ఉడుకకపోవడంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తెలుస్తోంది. విద్యార్థుల తల్లిదండ్రులు సమాచారం అందుకుని హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి చికిత్సపొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. ఆసుపత్రి డాక్టర్ రాముతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులను మెరుగైన చికిత్స కోసం 108 అంబులెన్స్ ద్వారా జగిత్యాల ఆసుపత్రికి పంపించారు. అనంతరం విప్ మాట్లాడుతూ ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులను టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జక్కు రవీందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్ కుమార్, బీజేపీ జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్ పరామర్శించారు అస్వస్థతకు గురైన విద్యార్థులు నాగులపేట, రేచపల్లి, తాళ్లపేట, బురుదేశిపల్లె, గోవింద్‌పల్లెకు చెందిన వారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కాళ్ల లక్ష్మి తెలిపారు.

మహాకుంభ మేళాకు ఆరు ప్రత్యేక రైళ్లు..



- ఫిబ్రవరి 14, 18, 22 తేదీల్లో నడపనున్న దక్షిణమధ్య రైల్వే

పెద్దపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు మరో ఆరు ప్రత్యేక రైళ్లను అదనంగా నడుపనున్నట్లు అధికారులు శుక్రవారం ప్రకటించారు. రైలు నంబర్ 07111 ఫిబ్రవరి 14న ఉదయం 11:10 గంటలకు బీదర్ నుంచి దానాపూర్‌కు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 23.55 గంటలకు చేరుకోనున్నది. ఈ రైలు రాష్ట్రంలో జహీరాబాద్, వికారాబాద్, లింగంపల్లి, బేగంపేట్, సికింద్రాబాదు, చర్లపల్లి, జనగాం, ఖాజీపేట్, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్లలో ఆగనున్నది. ఇదే రైలు నంబర్ 07112 ఫిబ్రవరి 16న ఉదయం దానాపూర్‌నుంచి 15:15 గంటలకు బయలుదేరి, రెండో రోజు 23:45 గంటలకు చర్లపల్లి (హైదరా బాద్) స్టేషన్‌కు చేరుకోనున్నది. రైలు నంబర్ 07077 ఫిబ్రవరి 18, 22 తేదీల్లో మధ్యాహ్నం 15:00 చర్లపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి దానాపూర్ చేరుకోనున్నది. అలాగే రైలు నంబర్ 07078 ఫిబ్రవరి 20, 24 తేదీల్లో మధ్యాహ్నం 15:00 గంటలకు దానాపూర్‌లో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 23:45 గంట లకు చర్లపల్లి చేరుకోనున్నది. ఈ రైళ్లు రాష్ట్రంలోని జనగాం, ఖాజీపేట్, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్ ఆగుతాయి.

జమ్మికుంటలో రూ.7,150 పలికిన పత్తి ధర



జమ్మికుంట రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7150 పలికింది. శుక్రవారం వ్యవసాయ మార్కెట్ యార్డుకు 26మంది రైతులు 310క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 32క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7150, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

- పెద్దపల్లి లో రూ.7022

పెద్దపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం పత్తి ధరలు తగ్గడంతో రైతులు ఆందోళన చేయగా, శుక్రవారం మార్కెట్‌కు వచ్చిన పత్తికి అత్యధికంగా 7,022 రూపాయల ధర పలికింది. అత్యల్పంగా ఐదు వేల రూపాయలు, మోడల్ ధర 6,681 రూపాయలు పలికింది. అత్యధిక మంది రైతులకు 6,500 నుంచి ఏడు వేల రూపాయల మధ్య ధర పెట్టారు. మార్కెట్‌కు 1,199 బస్తాల్లో 1318.9 క్వింటాళ్ల పత్తిని 330 మంది తీసుకువచ్చారు. ఈ-నామ్ ద్వారానే పత్తిని ట్రేడర్లు పరిశీలించి ధరలు ఖరారు చేశారు. గురువారం అత్యధిక మంది రైతులకు క్వింటాలుకు 6,500 రూపాయలకు మించకుండా చెల్లించారు. 52 బస్తాలకే 7,001 నుంచి 7,031 ధర చెల్లించారు. అత్యధికంగా 6,500 నుంచి 7,000 చెల్లించారు.



కిందపడి గాయపడిన యాదాద్రి క్రీడాకారిణి సంగీత



కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న రాచకొండ, హైదరాబాద్ సిటీ పోలీస్ జట్లు

ఉత్సాహంగా.. పోలీస్ క్రీడలు

- పోటాపోటీగా నాల్గవ రోజు ఆటలు
- నేడు ముగింపు సమావేశం
- హాజరు కానున్న డీజీపీ డాక్టర్ జితేందర్

కరీంనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మూడవ తెలం గాణ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలు ముగింపు దశకు చేరా యి. నాలుగు రోజులుగా జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంతో పాటు 12 ప్రదేశాల్లో నిర్వహిం చిన 28 క్రీడలు చివరి దశకు చేరాయి. 20 పోలీస్ జోన్ల నుంచి 2400 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. పోటీల నాల్గవ రోజు శుక్రవారం వివిధ క్రీడాంశాల్లో సెమీఫైనల్స్, ఫైనల్స్ మ్యా చ్‌లను నిర్వహించారు. క్రీడా కారులు పోటాపోటీగా తమ క్రీడా ప్రతిభను చాటి విజేత లుగా నిలిచేందుకు కృషి చేశారు. వివిధ పోటీలను ఐజీపీ స్పోర్ట్స్ ఎస్ రమేష్ రెడ్డితోపాటు మరో ఐజీపీ ఎం చంద్రశేఖర్ ఎడ్డి, కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి, పోలీస్ స్పోర్ట్స్ ఆఫీసర్ రామారావు, ఏసీపీ విజయ్ కుమార్, ఆర్ఐ కుమారస్వామి తదితరులు పాల్గొని ప్రారంభించారు.

- పోటీల ఫలితాలు..

ఖో-ఖో పోటీల్లో టీజీఎస్‌బి-1 ప్రథమ స్థానం, టీజీఎస్‌బి-2 ద్వితీయ స్థానం, రాజన్న జోన్-3 తృతీయ స్థానం సాధించాయి. కబడ్డీ మహిళల విభాగంలో రాచకొండ కమిషనరేట్ ప్రథమ స్థానం, యాదాద్రి జోన్ ద్వితీయ స్థానం సాధించాయి. పురుషుల విభాగంలో హైదరాబాద్ సిటీ జోన్ ప్రథమ స్థానం, రాచకొండ ద్వితీయ స్థానం సాధించాయి. బాస్కెట్‌బాల్ క్రీడాంశంలో హైదరాబాద్ కమిషనరేట్ ప్రథమ స్థానం, కాళేశ్వరం జోన్ ద్వితీయ స్థానాలు సాధించాయి. హాకీ క్రీడల్లో హైదరాబాద్ సిటీ జోన్ ప్రథమ స్థానం, వరంగల్ జోన్ ద్వితీయ స్థానం సాధించాయి. హ్యాండ్‌బాల్ క్రీడలో టీజీఎస్‌బి-1 ప్రథమ స్థానం, హైదరాబాద్ సిటీ ద్వితీయ స్థానం, భద్రాద్రి జోన్ తృతీయ స్థానం సాధించాయి. అలాగే ఫుట్‌బాల్ క్రీడలో టీజీఎస్‌బి-1 ప్రథమ స్థానం, హైదరాబాద్ సిటీ ద్వితీయ స్థానం, సైబరాబాద్ జోన్ తృతీయ స్థానం సాధించాయి. ఈ జట్లకు కరీంనగర్ పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం రాత్రి పతకాలను ప్రదానం చేశారు.

- నేడు పోటీల ముగింపు

రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల ముగింపు ఉత్సవాన్ని శనివారం నిర్వహించనున్నారు. పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించే ఈ ముగింపు సమావేశానికి తెలంగాణ రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. వివిధ క్రీడాంశాల్లో గెలుపొందిన జట్లకు ట్రోఫీలతోపాటు ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను కూడా అందించనున్నారు.



పతకాలు అందుకున్న క్రీడాకారులు



వాలీబాల్ ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న సైబరాబాద్, హైదరాబాద్ క్రీడాకారులు

ప్రతి సంవత్సరం పోలీస్ క్రీడల నిర్వహణకు కృషి

- ఐజీ స్పోర్ట్స్ రమేష్‌రెడ్డి

కరీంనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహణకు నోచుకోని తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను ఇక నుంచి ప్రతి సంవత్సరం నిర్వహించేందుకు కృషి చేస్తానని ఐజీ స్పోర్ట్స్ తెలంగాణ రమేష్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న మూడవ తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలలో శుక్రవారం ఆయన ఖో-ఖో, హాకీ, వాలీబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను ఘనంగా నిర్వహిస్తున్న కరీంనగర్ పోలీస్ కమిషనర్‌ను ఆయన అభినందిం చారు. అనంతరం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో హాకీ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. అలాగే సీటీసీ మైదానంలో నిర్వహిస్తున్న ఖో-ఖో పోటీలను తిలకించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న స్పోర్ట్స్ ఐజీ రమేష్‌రెడ్డి

ఖో-ఖో క్రీడల్లో మంచి ప్రతిభచాటుతున్న సిరిసిల్ల జోన్ అంతర్జాతీయ క్రీడాకారుడు వెంకటేష్‌ను ఐజీ అభినం దించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ డీఎస్పీ రామారవు, ఏసీపీ విజయ్ కుమార్, సీఐ మధు, ఎస్ఐ నరేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మట్టి నుంచి మ్యాట్‌పైకి..

- కబడ్డీకి పెరిగిన ఆదరణ
- ప్రో కబడ్డీతో కార్పొరేట్ స్థాయికి
- అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు డీఎస్పీ ఏ వేణుగోపాల్, ఇన్‌స్పెక్టర్ ఎం మహేందర్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడగా ఉన్న కబడ్డీ ఇప్పుడు కార్పొరేట్‌కు మారింది. పల్లెల్లో మట్టిరోడ్లపై ఆడిన ఆట మ్యాట్‌పైకి చేరింది. కబడ్డీ ఇప్పుడు కార్పొరేట్ క్రీడ.. ప్రో కబడ్డీ నిర్వహణతో రెండు తెలుగు రాష్ట్రాల అధికారిక క్రీడ ఇప్పుడు అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది. కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడలు నిర్వహిస్తున్న సందర్భంగా అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు డీఎస్పీ ఏ వేణుగోపాల్, ఇన్‌స్పెక్టర్ ఎం మహేందర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో పలు అంశాలు పంచుకున్నారు.

ప్రో కబడ్డీని టీవీల్లో 20 కోట్ల 20 లక్షల మంది ప్రేక్షకులు వీక్షించారు. ఇది ప్రపంచ చరిత్రలో అత్యధికం. ఏ క్రీడలో లేని విధంగా అత్యధికశాతం ఉద్యోగాలు కబడ్డీతో వస్తున్నాయని వారు తెలిపారు. గతంలో తెలుగు రాష్ట్రాల్లో కబడ్డీ అకాడమీలు ఉండేవి. అప్పుడు గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభగల క్రీడాకారులు అకాడమీలో చేరి ఉన్నతమైన క్రీడాకారుడులుగా ఎదిగారన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని జిల్లాకు ఒక కబడ్డీ క్రీడా అకాడమీ నెలకొల్పాలన్నారు. కబడ్డీ ఇప్పుడు ఇండోర్ క్రీడగా మారిందన్నారు. క్రీడా శిక్షణతో విద్యార్థులలో ఆరోగ్యం, చక్కని శారీరక అభివృద్ధి కలుగుతాయని అన్నారు. ఉత్తమ పౌరులుగా ఎదిగే అవకాశం ఉందని తెలిపిపారు. తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కబడ్డీ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత 2017లో రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను నిర్వహించారన్నారు. ఇప్పుడు ఐజీ స్పోర్ట్స్ రమేష్‌రెడ్డి కృషితో కరీంనగర్‌లో మూడవ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను నిర్వహించడం అభినందనీయ మన్నారు. ప్రతి సంవత్సరం పోలీస్ క్రీడలను నిర్వహిస్తే, ప్రతిభగల క్రీడాకారులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు.



ఏ వేణుగోపాల్, ఎం మహేందర్ రెడ్డి

"పోలీసుశాఖలో ఉన్నతస్థాయిలో ఉన్న డీఎస్పీ ఏ వేణుగోపాల్ 2000 సంవత్సరంలో కొలంబోలో జరిగిన ఏషియన్ కబడ్డీ పోటీల్లో భారతజట్టు నుంచి పాల్గొని బంగారు పతకం సాధించారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం మహేందర్‌రెడ్డి 2016 సంవత్సరంలో అస్సాంలో జరిగిన సౌత్ ఏషియన్ గేమ్స్‌లో భారతజట్టుకు ప్రాతినిధ్యం వహించి బంగారు పతకం సాధించారు."

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్,జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) బీఏ, బీకాం, బీఎస్సీ ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫె సర్ డి.వరలక్ష్మి శుక్రవారం విడుదల చేశారు. బీఏలో 47.74 శాతం, బీకాంతో 70.25, బీఎస్సీ లైఫ్ సైన్సెస్‌లో 48.46, బీ ఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో 60.94 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు ఆమె తెలిపారు. https://gdcwakarimnagar.com ఫలితాలు కళాశాల వెబ్సై ట్‌లో అందు బాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి న భక్తులు ఉదయం నుంచి రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లిం చుకున్న భక్తులు శ్రీపార్వతి పర మేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం అన బంధ ఆలయాల్లో కుంకుమ పూజలు ర్వహించారు.

- రాజన్న ఆలయంలో విభాగాల హక్కులకు టెండర్ నిర్వహణ

రాజన్న ఆలయంలోని పలు విభాగాల్లోని హక్కులకు ఓపెన్‌స్లాబ్‌లో టెండర్ నిర్వహిం చారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికా రులు రెండు సంవత్సరాలకు టెండ ర్‌ను నిర్వహించగా, కొబ్బరికాయల విక్రయం లైసెన్స్ హక్కులను రూ.2 కోట్ల 20 లక్షల 55 వేల 555కు శివరాత్రి చందు దక్కించుకోగా, వెజిటేరియన్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను వేములవాడకు చెందిన రమేష్ రూ.46 లక్షల 50 వేలకు, కరీంనగర్‌లోని ఆలయానికి చెందిన 26వ నంబర్ షాప్ రూ.3 లక్షల 60 వేలకు, రాజన్న ఆలయంలోని శ్రీస్వామి వారికి భక్తులు సమ ర్పించుకునే ఒడిబియ్యం టెండర్‌ను జోగాపూర్ గ్రామానికి చెందిన విక్రమ్ రూ.కోటి 95లక్షల 55వేల 999కి దక్కించుకున్నట్లు ఆలయాధి కారులు వెల్లడించారు.



ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు

ఎగువ మానేరులోకి మల్లన్నసాగర్ నీటి విడుదల

గంబీరావుపేట. జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా గంబీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టులోకి మల్లన్న సాగర్ నీటిని విడుదల చేశారు. రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు నీటి విడు దల చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఈ ప్రాంత రైతుల ప్రయోజ నార్థం 0.5 టీఎంసీల నీటి విడుదలకు సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్ చార్జి విన్నవించారని హమీద్ తెలిపారు. రైతుల పంటలు ఎండిపోకుండా మల్లన్నసాగర్ నుంచి మానేరులోకి నీటిని విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నీటి విడుదలకు సహక రించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం వరకు మల్ల న్నసాగర్ నీరు ఎగువ మానేరులోకి చేరుతుండటంతో ఈ ప్రాంత రైతుల్లో ఆనందం నెలకొంది.

వైకల్యాన్ని జయించి..

- కార్, బైక్ సర్వీసింగ్ సెంటర్లు ఏర్పాటు..
- స్వయంఉపాధితో దివ్యాంగుల ముందడుగు..

రుద్రంగి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలానికి చెందిన ఇద్దరు యువకులు పుట్టకతో వచ్చిన లోపాలను లెక్క చేయకుండా.. పట్టుదలతో వృత్తిలో రాణిస్తున్నారు. మూగ, చెవిటివారైన ఆ ఇద్దరూ స్వయం ఉపాధితో ముందుకు సాగుతున్నారు. మెరుగైన పనితనంతో తమ వద్దకు వచ్చిన కస్టమర్లను ఆకట్టుకుం టున్నారు.

మండల కేంద్రానికి చెందిన మెల్ల దేవలక్ష్మి-నర్సరెడ్డి దంపతుల రెండో కూమారుడు మెల్ల ప్రవీణ్ పుట్టుకతో చెవిటి, మూగ. గ్రామంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుకున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్టిలో పెట్టుకొని చదువు మానేసి. రుద్రంగిలో బైక్ మెకానిక్ షాపులో రెండు సంవత్సరాల పాటు రిపేరింగ్ నేర్చుకున్నాడు. అనంతరం తెలిసిన వారి వద్ద కొంత రుణం తీసుకొని కారు, బైక్ వాటర్ సర్వీసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశాడు. తన ఆర్థిక ఎదుగుదలకు వైకల్యం అడ్డుకాకూడదని భావించిన ప్రవీణ్ మెరుగైన పనితీరుతో వాహనదారులకు ఆకట్టుకుంటున్నాడు. ప్రస్తుతం ఖర్చులు పోను నెలకు రూ.15 వేల వరకు మిగులుతున్నాయని ప్రవీణ్ పేర్కొంటున్నాడు. అలాగే మండల కేంద్రానికి చెందిన చిట్టపురం గణేష్ అనే యువకుడు సైతం పుట్టుకతో మూగ, చెవిటి. వాహనాల వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో కొంతకాలం పనిచేశాడు. ఏడాది క్రితం కొంత అప్పు చేసి ఇంటి వద్దనే రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకొని కారు, బైక్ వాటర్ సర్వీసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. తనలోని లోపాన్ని చూసి కృంగి పోకుండా స్వంతంగా ఉపాధి పొందుతున్న గణేష్‌ను పలువురు అభినందిస్తున్నారు.



కార్ వాటర్ సర్వీసింగ్ చేస్తున్న ప్రవీణ్



బైక్ వాటర్ సర్వీసింగ్ చేస్తున్న గణేష్

విజేత సూపర్‌మార్కెట్ ప్రారంభం

సుభాష్‌నగర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రేగులపాటి పాపా రావు కాంప్లెక్స్ (పాత స్పెన్సర్స్ మాల్)లో నూతనంగా ఏర్పాటు చేసిన విజేత సూపర్ మార్కెట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్, సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నిరకాల సరుకులు ఒకేచోట దొర కడం ప్రజలకు ఎంతో సౌకర్యవం తంగా ఉంటుందన్నారు. సూపర్ మార్కెట్ నిర్వాహకులు మాట్లా డుతూ సరసమైన ధరలకు అన్ని రకాల వస్తువులు అందజేస్తున్నా మని తెలిపారు. అన్నిరకాల సరు కు లు అందుబాటులో ఉంచా మని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్, సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిలను సన్మానించారు. మాజీ ఎమ్మె ల్యే రేగులపాటి పాపారావు, మాజీ కార్పొరేటర్ బండ సుమ రమణారెడ్డి సూపర్‌మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.



కరీంనగర్‌లో విజేత సూపర్‌మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

బ్లాక్‌మెయిల్ కేసులో ఇద్దరి అరెస్ట్

జగిత్యాల అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల పట్టణంలోని పరిశ్రమల కేంద్రంలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఎర్ర యాదగిరిని బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేసిన భూక్య సంతోష్ నాయక్, పాలకుర్తి రాకేష్‌లను అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. ఈనెల 20న యాదగిరి పనిచేస్తున్న చోటుకు వెళ్ళి తన బంధువుకు సబ్సిడీపై కారు కావాలని 5వేల రూపాయలు ఇచ్చి రహస్యంగా వీడియో తీశారు.

తాను ఒక చానల్ రిపోర్టర్‌నని డబ్బులు తీసుకున్న వీడియోను గ్రూప్‌లో పెడతానని యాదగిరిని భూక్య సంతోష్ నాయక్ బెదిరించి విడతల వారీగా 8.5 లక్షల రూపాయలు వసూలు చేశారు. అనంతరం ఆ డబ్బులు సరిపోవని తమ చానల్ యజమాని ఒప్పుకోవడం లేదని మరో ఏడు లక్షలు కావాలని డిమాండ్ చేయగా బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ కేసులో శుక్రవారం అరెస్ట్ అయిన నిందితులతో పాటు మలోత్ తిరుపతి, భూక్య గంగాధర్, బాలె జగన్‌లపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ వేణుగోపాల్, ఎస్సై కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

జగిత్యాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యత శిబిరానికి ఎన్ఎస్ఎస్ విద్యార్థిని కె. మేఘన ఎంపిక అభినందనీయమని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రమోద్ కుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్ విద్యార్థినీ మేఘన జాతీయ సమైక్య శిబిరానికి ఎంపికయిన నేపథ్యంలో శుక్రవారం కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో అభినందించారు. ఫిబ్రవరి 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో బెంగుళూరులో జరిగే సమైక్యత శిబిరంలో శాతవాహన యూనివర్సిటీ నుంచి ప్రాతినిత్యం వహించడానికి మేఘనను ఎంపిక చేశారన్నారు. శిబిరానికి ఎంపికయిన మేఘనకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీలత, సుజాత, సంగీతా రాణి, అధ్యాపకులు డాక్టర్ వాసాల వరప్రసాద్, రహీం, రామచంద్రం పాల్గొన్నారు.

డ్రైవర్లకు సన్మానం

కోరుట్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కోరుట్ల డిపోలో పని చేసే డ్రైవర్లను శుక్రవారం ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్ ఆధ్వర్యంలో సన్మానించారు. జాతీయ రోడ్డు భద్రత ఉత్సవాలను పురస్కరించుకోని డిపోలో పని చేస్తున్న ప్రమాద రహిత డ్రైవర్లను గుర్తించి వారిని శాలువాలతో సత్కరించారు. డిపోలో డ్రైవర్లుగా పని చేస్తున్న రాజలింగం, యూసుఫ్, శేఖర్‌లను పూలమాలలతో సత్కరించి ప్రశంస పత్రంను అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది గంగారాం, వర్థిలాల్, షాదిక్, బాబు, సాగర్ పాల్గొన్నారు.

ఘనంగా గద్దర్ జయంతి వేడుకలు


కథలాపూర్‌లో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

జగిత్యాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ టౌన్ హాలులో శుక్రవారం బరిసె కళావేదిక, జజ్జనకరే జనారే కళాబృందం ఆధ్వర్యంలో గద్దర్ 77వ జయంతి వేడుకలను నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బండ శంకర్ మాట్లాడారు. ప్రజల కొరకు తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్పధృవతార, ప్రజా గాయకుడు గద్దర్ అన్నారు. ప్రతి అంశంపై గద్దర్ కలం నుంచి గలం నుంచి వినిపించిన పాటలను గుర్తు చేస్తూ కొనియాడారు. సామాజిక రుగ్మతలను రూపుమాపడంలో గద్దర్ పాత్ర అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పుల వెంకటరమణ, కండ్లె అంజి, బోదనపు నటరాజ్, కునమల్ల సుమన్, బెత్తపు నరసన్న, లక్ష్మీనారాయణ, కాయితీ శ్రీనివాస్, బిట్ల ప్రకాశ్, మద్దెల నారాయణ, కళాభిమానులు పాల్గొన్నారు.

●**కథలాపూర్:** ప్రజాయుద్ధ నౌక గద్దర్ 77వ జయంతి వేడుకలు శుక్రవారం మండల కేంద్రంలో ప్రజాగాయకుడు బత్తుల నరేశ్ నేతృత్వంలో నిర్వహించారు. గద్దర్ సామాజిక న్యాయం, తన ఆటా, పాటలతో ప్రజల్లో చైతన్యం తెచ్చారని అన్నారు. 50 సంవత్సరాల పాటు వివిధ రకాల ఉద్యమాలకు ఊపిరి పోశారని చెప్పారు. పీడిత ప్రజల కోసం తన జీవితాంతం ఆటా, పాటలతో పోరాటాలు చేసిన చరిత్ర ఉండగా కొందరు మతతత్వ పార్టీల నేతలు గద్దర్‌కు పద్మశ్రీ అవార్డు ఇవ్వమని చెప్పడం శోచనీయమని అన్నారు. గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో గాయకుడు అలీబాబా, దయ్య ప్రశాంత్, అంబటి రాధాకృష్ణ, కోట శంకర్, పానుగంటి సాగర్, జంగం నరేశ్, సాగర్, బోడ నాగరాజు, జ్యోతిబాబు తదితరులు ఉన్నారు.

●**మల్లాపూర్:** మండలంలోని పలు గ్రామాల్లో ప్రజా గాయకుడు గద్దర్ జయంతి వేడుకలు నాయకులు, యువకులు ఘనంగా నిర్వహించారు. గురువారం మండలంలోని వేంపల్లి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి అచ్చ శ్రీను ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక కేక్‌ను కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల కోసం నిరంతరం ఆయన పాటలతో పోరాటం జరిపిన గొప్ప ఉద్యమ వీరుడుగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జలపతిరెడ్డి, నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పోతు శేఖర్, మండల పీస్‌మెన్ అధ్యక్షుడు రొడ్డ రాజు, నంద కాశిరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన 'ఆపరేషన్ స్మైల్'

జగిత్యాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ప్రతీ యేటా జనవరి మాసంలో నిర్వహించే ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా ప్రస్తుత యేడాది జనవరి 1వ నుంచి 31వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్పెషల్ డ్రైవ్‌లో జిల్లా వ్యాప్తంగా 30 మంది బాల కార్మికులను రెస్క్యూ చేసి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరిచారు. ఇందులో 11 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కాగా 19 మంది పిల్లలు తెలంగాణకు చెందిన వారున్నారు. ఆపరేషన్ స్మైల్‌లో గుర్తించిన బాల కార్మికులను, పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. జిల్లా పోలీసు శాఖ, కార్మిక శాఖ, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సంయుక్తంగా ఆపరేషన్ స్మైల్ నిర్వహించారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

-ఆట వస్తువులు, సామగ్రి కరువు -బోర్డులకే పరిమితం



మెట్‌పల్లిలో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

మెట్‌పల్లిటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి పట్టణంలో పలు క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా తయారయ్యాయి. పట్టణంలోని పలు వార్డులలో ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. కానీ ప్రభుత్వం అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు 2 లక్షల నుంచి 5 లక్షల వరకు ఖర్చు చేయగా అవి ప్రస్తుతం అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. కేవలం బోర్డులు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని క్రీడా ప్రాంగణాలలో రెండు పోల్స్, ఎక్సర్‌సైజ్ బారులను ఏర్పాటు చేసి వదిలేశారు. ఆటలు ఆడే పరిస్థితి లేదు. చాలా ప్రాంగణాలు పిచ్చి మొక్కలు పెరిగి అధ్వాన్నంగా తయారయ్యాయి.

వసతులేవ్..క్రీడా సామాగ్రి జాడలేవ్

క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు గ్రౌండ్‌ను చదును చేసి బోర్డులు మాత్రమే తగిలించారు. కానీ క్రీడా ప్రాంగాణాలో అవసరమైన క్రీడా సామగ్రి, వసతులు కల్పించలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని అర్బన్ హౌజింగ్ కాలనీలో ఏర్పాటు చేసిన క్రీడా మైదానంలో పిచ్చి మొక్కలు పెరిగి దర్శనమిస్తున్నాయి. డీఎస్పీ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం ఆటోలు, కార్ల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిని ఉపయోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

భౌతిక శాస్త్రంపై ఆసక్తి పెంచుకోవాలి

మెట్‌పల్లి జనవరి 31(ఆంధ్రజ్యోతి): భౌతిక, రసాయన శాస్త్రంపై అవగాహన పెంచుకోవాలని ఎంఈవో మేకల చంద్రశేఖర్ అన్నారు. మెట్‌పల్లి ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మండల ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు ఆయన ముఖ్యఅథిగా హాజరయ్యారు.

●మల్లాపూర్: విద్యార్థులు భౌతిక రసాయన శాస్త్రం పట్ల ఆసక్తిని పెంచుకొని చదివితే భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకుంటారని మండల విద్యాధికారి దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల రిసోర్స్ సెంటర్‌లో ఎఫ్ఎస్టీ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. అనంతరం మంచి ప్రతిభ కనబరించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

●రాయికల్: విద్యార్థుల్లో దాగి ఉన్న శక్తి సామర్థ్యాలు వెలికితీసేందుకే పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో శ్రీపతి రాఘవులు అన్నారు. రాయికల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు భౌతిక శాస్త్ర ప్రతిభ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ చూపారు. విజేతలకు ఎంఈవోతో పాటు హెచ్ఎంలు శ్రీనివాస్, రమేష్‌లు బహుమతులు అందజేశారు.

1.87 లక్షల మొక్కల పెంపకం లక్ష్యం

కథలాపూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వన మహోత్సవం పథకం కింద మండలంలోని 19 గ్రామాల్లో వచ్చే ఏడాది 1.87 లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా నిర్ణయించినట్లు ఎంపీడీఓ శంకర్ తెలిపారు. నర్సరీల్లో ఇప్పటికే బ్యాగుల్లో మట్టి నింపడం, విత్తనాలు నాటడం వంటి పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది రు. 12 కోట్ల నిధుల లక్ష్యం నిర్ణయించుకోగా రు. 14 కోట్ల మేర పనులు పూర్తి చేశామని అన్నారు.

నిర్మలమ్మ కరుణించేనా..?

(3వ పేజీ తరువాయి)

మామిడిని రవాణా చేసి విక్రయించుకునేలా రైలు సదుపాయం కల్పించాలని అన్నదాతలు కోరుతున్నారు.

● **జాతీయ రహదారుల విస్తరణకు నిధులు వచ్చేనా?**

నిజామాబాద్ జిల్లా పెర్కిట్ నుంచి జిల్లాలోని మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురిల మీదుగా మంచిర్యాల వరకు వెళ్తున్న జాతీయ రహదారిని ఫోర్‌లేన్ రహదారిగా విస్తరించాలని నిర్ణయించారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించి భూ సేకరణ పనులు నిర్వహిస్తున్నారు. జగిత్యాల నుంచి కరీంనగర్ రహదారి విస్తరణ పనులు సైతం నత్తనడకలో సాగుతున్నాయి. ప్రధానిగా నరేంద్ర మోదీ మూడవ పర్యాయం అధికారం చేపట్టిన తదుపరి మోదీ 3.0 కార్యక్రమంలో భాగంగా ఈ రెండు రహదారులను చేర్చినప్పటికీ పలు కారణాల వల్ల తొలగించారు. జగిత్యాల-కరీంనగర్, పెర్కిట్-మంచిర్యాల జాతీయ రహదారుల విస్తరణకు అవసరమైన పూర్తి స్థాయి నిధులు మంజూరు చేసి పనులు వేగవంతం చేయాలన్న డిమాండ్ ఉంది.

ప్రధాన ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్

జగిత్యాల అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని కలెక్టర్ సత్య ప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎమర్జెన్సీ విభాగం, పలు వార్డులను సందర్శించి రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వంట గదిని పరిశీలించిన కలెక్టర్ రోగులకు నాణ్యమైన అహారాన్ని అందించాలని సూచించారు. ఆయన వెంట తహసిల్దార్, మున్సిపల్ కమీషనర్ చిరంజీవి తదితరులు ఉన్నారు.

వడ్డెర ఓబన్న విగ్రహ ఆవిష్కరణ


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదాపూర్ గ్రామంలో శుక్రవారం వడ్డెర ఓబన్న విగ్రహ ఆవిష్కరణ స్థానిక నాయకులతో కలిసి కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన ఒడ్డెరుల ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన విగ్రహంను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, మాజీ ఎంపీపీ తోట నారాయణ, రైతు సమన్వయ కమిటి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకటరావు, మాజీ సర్పంచ్‌లు బాస్కర్ రెడ్డి, వనతడుపుల అంజయ్య పాల్గొన్నారు.

బైక్ ఢీకొని యువకుడి మృతి


నగేష్(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, జనవరి, 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతలపేట గ్రామంలో జరిగిన శుభకార్యానికి వెళ్లి వస్తుండగా శుక్రవారం బైక్ ఢీకొని యువకుడి మృతిచెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన బర్మ నగేష్(31)అను యువకుడు మండలంలోని చింతలపేట గ్రామంలోని శుభకార్యానికి హాజరయ్యాడు. అనంతరం రాత్రి ద్విచక్ర వాహనంపై వేములకుర్తి తిరిగి బయలు దేరాడు. మెట్‌పల్లి పట్టణంలో మెకానిక్ నేర్చుకుంటున్న కోరుట్ల మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామానికి చెందిన సోఫియన్ అను యువకుడు ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలు దేరాడు. గ్రామ శివారులోని మల్లన్న గుడి సమీపంలో ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి.

బర్మ నగేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలపాలైన సోఫియన్‌ను మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికులు తరలించారు. బర్మ నగేష్‌కు భార్య, మూడు నెలల కొడుకు ఉన్నారు. బర్మ నగేష్ మేనమామ రాజుకుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి

● **జిల్లా విద్యాధికారి రాము**

బీర్‌పూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. శుక్రవారం బీర్‌పూర్ మండల కేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మాట్లాడతూ విద్యార్థులు తమ బంగారు భవిషత్తును విద్యార్థులు పోటీ తత్వంతో చదవాలని అన్నారు. విద్యార్థి దశలో చదువుపై ఆసక్తి చూపితే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ సిహెచ్ సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంగనభట్ల నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

కొడిమ్యాల, జనవరి31(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్ గ్రామంలో శుక్రవారం పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామ మహిళలు నెత్తిన బోనాలను ఎత్తుకొని పోచమ్మ ఆలయానికి డప్పు చప్పుళ్ళతో వెల్లి నైవేద్యం సమర్పించారు. తమ కుటుంబాలను చల్లంగా చూడాలని పోచమ్మ తల్లిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు లక్ష్మీపతి, గంగాదర్, అశోక్, రామస్వామి, రాజమల్లయ్య, దామోదర్, సంఘం సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

రోడ్డుభద్రతా నియమాలు పాటించాలి

జగిత్యాలరూరల్, జనవరి 31 : రోడ్డుభద్రత నిత్యజీవితంలో భాగంకావాలని, ఓవర్‌స్పీడ్ నిర్లక్ష్య డ్రైవింగ్ అనే మానవ తప్పిదాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని , వీటిని అరికట్టాల్సిన భాద్యత డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరిపై ఉందని జగిత్యాల జిల్లా రవాణాశాఖ అధికారి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బస్టాండ్ లో జాతీయ రోడ్డుభద్రత ముగింపు కార్యక్రమాన్ని రవాణాశాఖ, ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో జగిత్యాల ప్రైవేట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ లు, రవాణాశాఖ ఎంవీఐ అభిలాష్, సిబ్బంది పాల్గొన్నారు.

మా గ్రామాన్ని కొండాపూర్‌లో కలపొద్దు

● **చెర్లపల్లి గ్రామస్థుల ధర్నా**

ఎండపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెర్లపల్లి గ్రామాన్ని ఎంపీటీసీ పరిధిలో చెర్లపల్లి, కొండాపూర్ గ్రామాలను కలిపి ఎంపీటీసీ పరిధి నిర్ణయించారని మాకు కొండాపూర్ గ్రామంతో ఎంపీటీసీ పరిధి వద్దని శుక్రవారం రహదారిపై చెర్లపల్లి గ్రామస్తులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామస్థులు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పడిదం మొగిళి, సిగిరి ఆనంద్, రామగిరి రాజేశం తదితరులు పాల్గొన్నారు.

వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం

కోరుట్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వాసవి మాత దేవాలయంలో దేవి ఆత్మారణ దినోత్సవంను శుక్రవారం ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. వేదపండితుడు పాలెపు రామకృష్ణశర్మ మత్రోత్చరణ మధ్య ప్రత్యేక పూజలను నిర్వహించారు.

మల్లాపూర్, జనవరి, 31 (ఆంధ్రజ్యోతి) : వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని ఆలయంలో భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వాసవి మాత ఆలయంలో మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల ఆర్యవైశ్యులు సతీ సమేతంగా పాల్గొని చండి హోమమును భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వాసవి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు.

పసుపు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి


పసుపు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ కూన గోవర్దన్

మెట్‌పల్లి రూరల్, జనవరి, 31 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో ఏర్పాటు చేసిన పసుపు కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ కూన గోవర్దన్ అన్నారు. శుక్రవారం మెట్‌పల్లి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పాలక వర్గం, వ్యాపారస్థులతో కలిసి ప్రారంభించారు. అనంతరం యార్డుకు తీసుకొచ్చిన పసుపు కుప్పలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వమే పసుపు కొనుగోళ్లు చేపడుతుందని, ఎండిన పసుపును మార్కెట్ యార్డు తీసుకొచ్చి మద్ధతు ధరను పొందలన్నారు. మార్కెట్ యార్డులో మొదటి రోజు పసుపు కాడి(కొమ్ము) క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ. 12,666, కనిష్ఠ ధర రూ. 7వేలు, పసుపు గోళ(మండ) క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ. 10,666, కనిష్ఠ ధర రూ. 7వేలు, పసుపు చూర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ. 10,122, కనిష్ఠంగా రూ. 9,566 ధర ఉందన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, మార్కెట్‌లో ప్రతి రైతుకు భరోసా కల్పించేందుకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి మద్ధతు ధర అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ యార్డు డైరెక్టర్లు కాటిపల్లి అనంతరెడ్డి, సంగు గంగాధర్, పుల్లూరి నవీన్, వ్యాపారస్థులు జెట్టి లింగం, మహజన్ నర్సింహులు, సామ బుచ్చయ్య, పుల్లూరి రాములు, ఎలిమి రవి, పుప్పాల చిన్నఅంజయ్య, గుంటుక అరవింద్, అందె మారుతి, కార్యదర్శి ఇంద్రసేనరెడ్డి, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు-కారు ఢీ

● **తప్పిన పెను ప్రమాదం**

మల్యాల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మల్యాల క్రాస్ రోడ్డు వద్ద ఆర్టీసీ బస్సు, ఎర్టిగా వాహనం ఎదురెరుగా ఢీ కొన్నాయి. జగిత్యాల నుంచి వేములవాడ వెలు తున్న ఆర్టీసీ బస్సు, జగిత్యాల వైపు వస్తున్న ఎర్టిగా వాహనం ఢీకొనగా రెండు వాహనాలు స్వల్పంగా దెబ్బతి న్నాయి. ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరుగకపోగా పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఘటన స్థలం నుంచి వాహనాలను పోలీసులు తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

ఇబ్రహీంపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పోచమ్మబోనాలు సమర్పించే భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యా లు కల్పించాలని కోరుతూ సుఖీభవ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.

కార్యక్ర మంలో సుఖీ భవ ఆర్గనేజేషన్ వ్యవస్థాపకులు నాగరాజు, రెవెన్యూ డివిజన్ సాధన నాయకులు నాంపల్లి గట్టయ్య, గురుకులాల పేరెంట్స్ కమిటీ జనరల్‌సెక్రటరీ తరి స్వామి, శ్రీనివాస్, లవకుమార్, పాల్గొన్నారు.

ఈజీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సారంగాపూర్, జనవరి, 31 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని ఉపాధిహామీ పథకం ఉద్యోగులు స్థానిక ఎంపీడీవోకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. పెండింగ్ జీతాలను చెల్లించాలని, పేస్కేల్ అమలు చేయాలని కోరుతూ పెన్‌డౌన్, షట్‌డౌన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం ఉద్యోగులు శ్రీలత, కోటీరెడ్డి, శివ, తదితరులు పాల్గొన్నారు.

●రాయికల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల పెండింగ్ వేతనాలు, పే స్కేల్ అమలు ఇతర డిమాండ్ల కోసం రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ ఆదేశాల మేరకు రాయికల్ మండలంలోని మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. ఈ నెల 29న జిల్లావ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలు ధరించి ఎంపీడీవోలకు వినతి పత్రాలు సమర్పించగా, రాయికల్‌లో ఎంపీడీవో చిరంజీవికి శుకరవారం వినతి పత్రం సమర్పించారు. ఫిబ్రవరి 1న పెన్‌డౌన్, షట్ డౌన్, 12 వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఇకనైనా ప్రభుత్వ ఉపాధి హామీ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్ హయాంలో అప్పుల ఊబిలో రాష్ట్రం


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు కృష్ణారావు

మెట్‌పల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భవిష్యత్‌ను అగాధంలోకి నెట్టి అవినీతి పునాదులపై ఫాంహౌజ్‌లు నిర్మించుకున్న కల్వకుంట్ల కుటుంబమా కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేసేందని అన్నారు. 2014లో తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే మొట్టమొదటి ముఖ్యమంత్రిగా దళితున్నే చేస్తానని హామీ ఇచ్చి దళితులను దగా చేసిన కుటుంబమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకలు జట్టి లింగం, అల్లూరు మహేందర్ రెడ్డి, యామ రాజయ్య, మార్గం గంగాదర్, తుమ్మలపల్లి రాంప్రసాద్, వెంకట్ రెడ్డి, పూదరి నర్సాగౌడ్, కొంతం రాజం, ముఖీమ్, బత్తుల భరత్ పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర స్వామి ఉత్సవ కమిటీ చైర్మన్‌గా రాజయ్య

వెల్గటూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్తంభంపల్లి శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఉత్సవ కమిటీ చైర్మన్‌గా చింత రాజయ్యను నియమిస్తూ ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

సభ్యులుగా గోరువంతుల మహేష్, అన్నవేని మల్లేష్, యాగండ్ల రాజ య్య, అన్నవేని వెంకటేష్, రాపాక వెంకటేష్ నియమితులయ్యారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థిని ప్రతిభ

మల్యాల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి తెలంగాణ ఇంగ్లీష్ ఒలింపియాడ్ పోటీలలో తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన డి.హర్షిక ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ మానస తెలిపారు.

పౌర హక్కుల దినోత్సవం

రాయికల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని ప్రజలందరూ సామాజి సమరసతను పాటించాలని రాయికల్ తహసీల్దార్ ఎంఏ అబ్దుల్ ఖయ్యూం అన్నారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

●కథలాపూర్: దళితులు, బలహీన వర్గాలను అవమానిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ నగేశ్ పేర్కొన్నారు. మండలంలోని తాండ్ర్యాలలో శుక్రవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు.

చెట్టు తొలగించవద్దని వినతి

మల్యాల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేట హనుమాన్ ఆలయం పక్కన గల రావి చెట్టును తొలగించే ప్రయత్నాలు విరమించుకోవాలని పంచాయితీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలంటూ ధర్మ రక్షణ సమితి ఆధ్వర్యంలో గ్రామస్తులు పంచాయితీ కార్యదర్శి స్వప్నకు వినతిపత్రం అందజేశారు. అనంతరం గ్రామ సమన్వయ సంఘం అధ్యక్షుడు లక్ష్మన్‌కు కూడా వినతిపత్రం అందించారు. ఆలయం వద్ద పురాతన రావి చెట్టు వద్ద భక్తులు పూజలు చేస్తారని అందులో పేర్కొన్నారు.

మాజీ చైర్‌పర్సన్‌కు సన్మానం

ధర్మపురి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మకు రాష్ట్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సంగి శేఖర్, సంగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.